# కళ

★

శ్రీమతి
కామరాజు
మైత్రేయి

★

'ఏమండీ, మీపేరు కళా? ముద్దుగావున్నది. కళోపాసకుల లక్షణాలన్నీ వున్నాయి ఆహా! మంచి ప్రొఫైలు వుంది. అదృష్టవంతుణ్ణి నీవు నిజంగా కళానిధివే సుమా!' అని నెమ్మదిగా, కళను రెండు చేతులలోకి తీసికొని బలవంతంగా ముద్దుపెట్టుగోబోయ్యాడు ఆ డైరెక్టరు...

'ఛీ! వదులు...'

'వదలను '

'జాగ్రత్త!'

'ఏం జేస్తావు?'

'నలుగురితో చెప్పి గడ్డిపెట్టిస్తాను...'

'ఆలోచించుకో...'

'నేను సినిమాలో పనిచెయ్యను—'

'ఏం కళోపాసినివి కావూ?'

'అయితే—'

'కళ అంటే మంచిచెడ్డలతో తీసికోవాలి'

'నాకు కళలో వుండే మంచే కావాలి'

'ఛీ! నీవంటి అవ్యక్తి మరొక్కతె వుండదు. సిరి వస్తుంటే మోకాలు అడ్డుతున్నావు.'

—చెళ్ళేలున ఒక్క లెంపకాయపెట్టి, డైరెక్టరు రూములోనుంచి పరుగెత్తుకొనివచ్చి కారులోపడ్డది కళ. అంతే, అంతటితో కళకు సినిమాకు విడాకులు. ఆ పరిశ్రమలో యింక చేరనని శపథంపట్టింది ఆ కళోపాసకురాలు. మరునాడు ఆంధ్ర దైనికపత్రికలో యొక పూర్తి పేజీ యడ్వరుటైజుమెంటు—

"ఆంధ్రలోకానికి నూత్నతార, డైరక్టరు, కెమేరామేను మొదలైనవారు, ఫిలిం పరిశ్రమకు తమ శక్తినంతా ధారపోసినవారు, సమస్త కష్టాలకు, శ్రమకు, ఖర్చుకు ఓర్చి, ప్రత్యేకించి యేరిన వరాలతార—మిస్ చంచల.

అభిప్రాయాలు:—

డైరెక్టరు:-ఇంతవరకు ఆంధ్రలోకం, కనని అందం, వినని గాత్రం. ఈమె అభినయించే నూత్నఫిలిం చూడండి.
కెమేరా:-ఏ ఫక్కీలో ఫోటో తీసినా యింత అందమైన వ్యక్తి నేను చూడలేదు.
సౌండు రికార్డరు:-ఏ స్థాయిలో పాడినా యింత హాయియైన పాట నేను వినలేదు.
మేకపు ఆర్టిస్టు:- ఏ మేకప్పు లేకుండా సహజమైన సౌందర్యం, లావణ్యం వుంది మిస్ చంచలకు.

త్వరలో రాబోవుచున్నది. రాబోయే ఉగాదికి ఆంధ్రలోకానికి కానుకగా అర్పింపదలచాము."

ఈ ప్రచురణ చూసింది కళ. భావాలు పరంపరలుగా రేగాయి. ఇవన్నీ తాను ఒప్పుకుంటే, తనకు వర్తించేవి. 'అబ్బా ఎవరినయినా చేయగలరు. ఏ తారనయినా సృష్టించగలరు. దుమ్ములో కలపగలరు. ఒకనాడు తార-మరునాడు కూడు గుడ్డలకు లేని బికారి.'

## ౨

కళ చిన్నప్పటినుంచి ఆదర్శకంగా పెరిగింది. బడిపంతులు సుబ్బారావుగారి కూతురు. ఈయన భార్య రాధ. ఎంతో గారాబంగా పెంచారు కళను. ఇరుగుపొరుగువారందరికి కళను చూస్తే ఎంతో ముచ్చటగావుండేది. చదువులో చురుకు. మంచి అందమైనది. సంగీతం బాగా నేర్చుకుంది. సుబ్బారావు నాట్యం అంటే చెవికోసుకునేవాడు. అందుచేత కళకు భరతనాట్యం నేర్పించాడు. తనకు వచ్చే కాస్త జీతం, 'కళ'ను ఆదర్శకంగా చేయాలని మొదటనుంచి ఖర్చుపెట్టేవాడు. బళ్లో ఏ యిన్స్పెక్టర్లు వచ్చినా, ఏ ప్రైజు రోజన్నా, అందరు కళ కోసము వెదకాలిసిందే. అందరు కళను అభినందించేవారు.

ఒకరోజు బళ్లో 'పేరంట్సు - డే' ప్రతి సంవత్సరంలాగే యీ సంవత్సరము జరపడానికి యేర్పాటులు జరిగాయి. ఆ రోజునే ప్రైజులన్నీ పిల్లలకు యిచ్చేవారు. పిల్లలు చిన్న నాటకం వేస్తారని, ఫాన్సీ వేషాలకు ప్రైజులిస్తారని ఏవేవో చెప్పుకుంటున్నారు. చిన్న పెద్ద అందరు చాలా హడావిడిగా వున్నారు. వూళ్లో వుద్యోగస్థులందరు వచ్చారు.

ప్రైజులు యిచ్చేటందుకు కలెక్టరు 'రాజు' గారికి ఆహ్వానము పంపుతే తప్పక వస్తాననీ, ఆరోజు ఆ వూళ్లో క్యాంపు వేస్తానని జవాబు వచ్చింది. ఇంతకంటే కావలసినదేమిటి? బడిఅంతా అట్టుడుకుతున్నది. మంచి తోరణాలు, ఎఱ్ఱ, పచ్చ కాగితాల జెండాలు, చెట్లమీదనుంచి బడిమీదికి, బడిమీదనుంచి చెట్లమీదికి ఎగురుతున్నాయి. సాయంత్రము 5 గంటలైంది. పిల్లలంతా మంచిమంచి జరీపావడలతో, చొక్కాలతో, వివిధరంగుల రిబ్బన్లతో, పూలతోను, ఒకరిచెయ్యి ఒకరు పట్టుకొని, గంతులు వేస్తూ, వుల్లాసముగా తలిదండ్రుల వెంబడి నడుస్తున్నారు. చూసేవారికి చాల హాయి గొలుపుతున్నది ఆ దృశ్యము. మంచిచెడ్డలు తెలియని ఆ పసికూనల జిలిబిలి పలుకులకు, వారు వేసే వివిధప్రశ్నలకు జవాబుచెప్పలేక, మాటలు మైమరపించి వారి పెద్దరికము కాపాడుకొనుటే ఉచితమని ఎంచి 'అదిగో, ఈవేళ కళ నాట్యం చేస్తుందిట. మీరుకూడ అలా నాట్యం నేర్చుకోకూడదా'అని పిచ్చిపిచ్చి ప్రశ్నలు వేయకుండా వారి బుద్ధి కుశలతను అణిచివేశారు.

హాలంతా క్రిక్కిరిసి తలిదండ్రులతో, ఆడపిల్లలతో కిటకిటలాడుతున్నవి. స్త్రీలు తలలలోవున్న పూలవాసనలచే హాలు పరిమళిస్తోంది.

బిళ్లబంట్రోతు, వెనక తహశీల్దారు, రివిన్యూ యిన్స్పెక్టరు, గుమాస్తా, కలెక్టరుగారితో హుందాగా దయచేసి వారికై ప్రత్యేకించిన స్థలాల్లో ఆసీనులయ్యారు.

మాష్టరుగారు చెప్పిన తొలిపలుకులతో, వార్షికరిపోర్టు చదవటం అయింది. ప్రెసిడెంటుగారు బడియొక్క రిపోర్టు విని ఆమోదించి మాష్టర్లకు, వారుచేసిన కృషికి మెచ్చుకొని, ధన్యవాదాలు అర్పించారు. ప్రైజులు యివ్వవలసిన అవకాశము వచ్చింది. హెడ్డుమాష్టరుగారు లేచి, 'అన్నిటిలో ప్రాముఖ్యతవహించి, ప్రతి సబ్జక్టులోను ఫస్టుమార్కులు వచ్చినందున, ఫస్టుప్రైజు బంగారుపతకం కుమారి కళకు'అని చెప్పారు. ముసిముసి నవ్వులతో, సిగ్గుతో తలవంచుకుని కలెక్టరుగారిదగ్గరకు వచ్చి బంగారుపతకం తీసికొంది. అందరు కరతాళధ్వనులు చేశారు. సుబ్బారావు, రాధల కళ్లు చెమ్మగిలినాయి. వారి పిల్ల యింత మందిలో పేరుదెచ్చుకొని, అందరి మెప్పులు తెచ్చుకోవటంకంటె తల్లిదండ్రులకు కావలసిందేమిటి? మిగతా

ప్రైజులన్నీ యివ్వడము అయినవెంటనే, ఏవో కొన్ని చిన్నచిన్న సీనులు, ప్రహసనాలు అయినవి. తర్వాత కుమారి కళ నాట్యము అన్నారు.

అంతా నిశ్శబ్దంగా వుంది. ఇదివరకే ఏర్పాటుచేసిన స్టేజిలో ఫిడేలు, మృదంగ వాయిద్యములు వాయిస్తున్నారు. ఎక్కడో మురళీనినాదం వినవచ్చింది. ఆ నాదాన్ని వెతుక్కుంటూ రాధ వచ్చింది. ఆ రాధే కుమారి కళ. నాట్యంచేసికొంటూ, మురళీనాథుని వెతుక్కుంటూ, ప్రేమతో ఆహ్వానిస్తూ, ప్రేమరసం కళ్ళలో ఒలుకుతూ, మురళీనాదం విననప్పుడు నిస్పృహచెందుతూ, వివిధభావాలు ముఖంలో చూపిస్తూ చూసేవాళ్ళకు ఒళ్లు పులకరింపజేస్తోంది.

ఇంకనుకొన్ని ఆటలుపాటలు అయినతర్వాత సభముగిసింది. కలెక్టరుగారు తమ తుది ఉపన్యాసములో, 'జీవితంలో కళ యేవిధంగా పైకివస్తుందో చూస్తువుంటాను. గృహచ్ఛిద్రాల్లోపడి 'కళ'ను మరచిపోయి, ముప్పైయేండ్లకే ముదుసలియై, జీవితముమీద రోతకలిగివుంటుందో, లేక, ఆంధ్రదేశానికి హిందూదేశానికి పేరుతెచ్చి, కళకు మెరుగులుపెట్టుతుందో చూస్తూవుంటాను' అనిచెప్పి సభముగించారు.

## 3

కాలచక్రము తిరుగుతోంది. కళకు 18 సంవత్సరాలు వచ్చేయి. సుబ్బారావుగారు చనిపోయాడు. రాధకు కష్టాలుఅన్నీవచ్చాయి. ఇంట్లో మగదిక్కులేదు. కళా తానుతప్ప ఎవ్వరులేరు. సుబ్బారావు ఆస్తి చాలావదలిపెట్టకపోయినా, ఏదో యింతతినటానికి భూవసతికల్పించాడు. దానితోటేవారు కాలము వెళ్లబుచ్చుతున్నారు. సుబ్బారావు బ్రతికివున్నప్పుడు రాధయెంతచెప్పినా కళకు పెళ్లిచెయ్యటానికి యిష్టపడలేదు.

కళకు చిన్నప్పటినుండి సినిమాలోకివెళ్లి పెద్దతారఅయిపోవాలని ఓ కోరికవుండేది. దానికితోడు సంగీతము, నృత్యము అవికూడ వుండడముచేత మరీ అభిలాష ఎక్కువగావుండేది. రోజు పేపరులలోవుండే సినిమాపోజులు, బొమ్మలు ఆవిడను ముగ్ధురాలినిగా చేస్తూవుండేవి. ఒకనాటిపేపరులో కళ 'తారలు' కావాలన్న అడ్వరుటైజుమెంటుచూసి, ఇన్నిరోజులకు తనకోరిక తీరుతున్నది కదాఅని, ఎదో జీవనోపాధి కనుపించుచున్నది కదాఅని, అప్లికేషను పెట్టుకొన్నది.

కళనుచూసిన దగ్గరనుంచీ యన్ని గౌరవాలు, ఆదరాలు ఆవిడవే. అసలు డైరెక్టరుగారు నిశ్చయించడమే రెండు మూడురోజులు కులాసాగావెళ్లిపోయింది.

డైరక్టరుగారిని దర్శించివచ్చిన తర్వాత కళ యేమిచేయటానికితోచక నిస్పృహతో తనపడక కుర్చీలో పడుకుని ఏదో ఆలోచిస్తోంది. భగ్నహృదయ జీవిత ఆశయాలన్నీ ఒకసారి రేకెత్తాయి. చిన్నతనంలో తనకువచ్చిన గౌరవాలు, ప్రైజులు, కలెక్టరురాజుగారి ఉపన్యాసం యివన్నీ ఒక్కసారి ఆమె మనోవీధిలో తళుక్కుమన్నాయి. వేడినిట్టూర్పు విడిచింది—

కళ ఎంతో ప్రయత్నంమీద కలెక్టరు రాజుగారి అడ్రెసు కనుక్కొని, ఆయన దర్శనార్థము వెళ్లింది. రాజుగారు కళను చూచి నిశ్చేష్టపోయినాడు. ఆనాటి కుమారి కళ యీనాటి భగ్నహృదయ కళ.

తనకున్న పలుకుబడి వినియోగించి స్త్రీ సదనములో నెలకు ఏభైరూపాయిల జీతంమీద పిల్లలకు కళోపాధ్యాయినిగా ఏర్పాటుచేయించాడు. ఇచ్చిన వాగ్దానము నెరవేరింది.

పిల్లలకి నాట్యము నేర్పుతూవుంటే కళకి ఎంతో ఆనందముగా వుండేది. పిల్లలను బాగా తరిఫీదు చేసేది. ఇక విద్యార్థినిలు సహజంగా, అవలీలగా నృత్యంచేస్తూవుంటే 'భావి ఆంధ్రదేశపు అవలోమా' అని అందరు అన్నారు. పాపం కుమారి కళ కళ్లు చెమ్మగిలి ఒక కన్నీటిబిందువు ముత్యమువలె జారింది—